రోడ్లు ఇలా.. పయనమెలా?

- తారు పాయే.. గుంతలు మిగిలే
- ఏళ్ల తరబడి మరమ్మతులు శూన్యం
- నరకప్రాయంగా తిమ్మాపూర్–ఎల్గూర్‌స్టేషన్ రోడ్
- ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు




తిమ్మాపూర్ నుంచి ఎల్గూర్‌స్టేషన్ వరకు ధ్వంసమైన రోడ్డు

సంగెం: మండలంలోని పలు గ్రామాల్లోని రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. మండలంలోని తిమ్మాపూర్– ఎల్గూర్‌స్టేషన్ ఆర్‌అండ్‌బీ రోడ్, కొత్త గూడెం క్రాస్ నుంచి కొత్తగూడెం గ్రామానికి వెళ్లే పీఆర్ రోడ్ గుంతలు ఏర్పడడంలో నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెన్యూవల్ చేయాల్సి ఉండగా కనీసం మరమ్మతులు చేపట్టకపోవడంతో గత వానాకాలంలో మరింత పెద్దగా గుంతలు మారాయి. ఏళ్ల తరబడి మరమ్మతులు చేపట్టకపోవడంతో కంకరరాళ్లు తేలి వాహనాల టైర్లు దెబ్బతింటున్నాయి. గుంతలు తేలి మట్టిరోడ్‌ను తలపిస్తున్నాయి. గత వానాకాలంలో ఇబ్బందులు పడినప్పటికీ ఇంకా మరమ్మతులు చేపట్టకపోవడం మళ్లీ వానాకాలం ప్రారంభం కావడంతో ఈ మార్గంలో ప్రయాణించాలంటే భయంతో వణికిపోతున్నారు. కాగా ఈ మార్గంలో తిమ్మాపూర్, ఎల్గూర్‌స్టేషన్, తూర్పుతండాల వద్ద సీసీ రోడ్ నిర్మాణం, ఎల్గూర్ స్టేషన్ నుంచి తూర్పుతండా వరకు బీటీ రోడ్డు వేశారు. తిమ్మాపూర్ నుంచి ఎల్గూర్‌స్టేషన్ గేట్ తండా వరకు సుమారు 3 కిలోమీటర్ల దూరం బీటీ వేయకపోవడంతో గుంతల వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కొత్తగూడెం క్రాస్ నుంచి సుమారు కిలోమీటర్‌న్నర రోడ్డు పూర్తిగా గుంతలు తేలి నరకప్రాయంగా మారిందని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బీటీ రోడ్డు వేసి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ షఫీయొద్దీన్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా పోన్ రింగ్ అవుతుందని లిఫ్ట్ చేయగానే వాయిస్ మెయిల్ రికార్డెడ్ అని వస్తున్నది. ఎన్ని సార్లు వాయిస్ మెయిల్ చేసినప్పటికి స్పందన లేదు.

వాహనాలు పాడైపోతున్నాయి



తిమ్మాపూర్ నుంచి ఎల్గూర్‌స్టేషన్ రోడ్ గుంతలమయమైంది. దీనిపై ప్రయాణించాలంటే నరకానికి వెళ్లినట్లుగా ఉంది. మా వాహనా లు దెబ్బతింటున్నవి. వాహనాలు కొనేటపుడు లైఫ్ టాక్స్ చెల్లిస్తున్నాం. కానీ రోడ్లు బాగు చేయడంలో మాత్రం అధికారులు విఫలమవుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి బీటీ రోడ్డు రెన్యూవల్ చేయాలి.

– పొన్నాల మధుకర్, ట్రాలీ డ్రైవర్

పంటల మార్పిడితో అధిక దిగుబడి

- శాస్త్రవేత్త డాక్టర్ శ్రావణ్



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ శ్రావణ్

నర్సంపేట రూరల్ : వ్యవసాయ క్షేత్రంలో పంటల మార్పిడితోనే అధిక దిగుబడులు సాధించవచ్చని శాస్త్రవేత్త డాక్టర్ శ్రావణ్ అన్నారు. మండలంలోని మహేశ్వరం గ్రామ పంచాయతీ ఆవరణలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీటకాలు, తెగుళ్ల వల్ల కలిగే నష్టాలను వివరించారు. తెగుళ్లు ఎలా సోకుతుందని, నివారణకు తీసుకోవాలని జాగ్రత్తలను వివరించారు. విత్తనాల ఎంపికలో రైతులు తీసుకోవాల్సిన మెలకువలను తెలిపారు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రైతులు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కృష్ణ కుమార్, డాక్టర్ వీరన్న, నర్సంపేట సొసైటీ చైర్మన్ బొబ్బల రమణరెడ్డి, వ్యవసాయ విస్తర్ణాధికారి వినేకర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం నిర్మాణం చేపట్టాలి



వర్ధన్నపేట : ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గు పోస్తున్న ఎంపీడీఓ వెంకటరమణ



ఖానాపురం : సమావేశంలో మాట్లాడుతున్న వైస్ చైర్మన్ హరిబాబు

వర్ధన్నపేట : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిబంధన ప్రకారం నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ వెంకటరమణ అన్నారు. బుధవారం మండలంలోని ల్యాబర్తిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ముగ్గు పోసి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు చిదుముల్ల భాస్కర్, కార్యదర్శి శ్రీకర్, ఇందిరమ్మ కమిటీ నాయకులు లక్ష్మీనారాయణ, భూక్య రవి, రావుల లక్ష్మి, నర్సింగం, సంకినేని దేవేందర్‌రావు, కోరుమల్లు, పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ఖానాపురం : అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తారని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, ఎంపీడీఓ అంబటి సునీల్‌కుమార్ అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారు నిర్మాణాలు చేపట్టుకోవాలన్నారు. నిర్మాణాల విషయంలో ఏవైనా ఇబ్బందులు ఉంటే అధికారులకు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి సుప్రజ, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు



నర్సంపేట రూరల్ : మండలంలోని రాజపల్లి గ్రామంలోని పెద్దమ్మతల్లికి 'మెపా' నాయకులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని ముదిరాజ్ కులపెద్దలు గూళ్ల సతీష్, పొన్నం రమేశ్ ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లి బోనాల వేడుకను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా 'మెపా' వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్, రాష్ట్ర కార్యదర్శి దండు చిరంజీవి, పొన్నం రాజు వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ, హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పూజలు ప్రారంభం



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లి సీతారామచంద్రస్వామి దేవాలయంలో ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు యాగశాలలో మహా హోమం నిర్వహించారు. ధ్వజస్తంభానికి సూర్యరశ్మితో అగ్నిహోత్రం చేసి జలాభిషేకం చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజల కార్యక్రమంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడింది. కార్యక్రమంలో చినజీయర్‌స్వామి శిష్యులు కిడాంబి నర్సింహదేశికన్ చార్యులు బృందం, ఆలయ చైర్మన్ చెన్నూరి కిరణ్‌రెడ్డి, ఆలయ అర్చకుడు రమేశ్‌మూర్తి, భజన మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

టౌన్ సీఐకి సన్మానం



టౌన్ సీఐ రఘుపతిరెడ్డిని సన్మానిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

నర్సంపేట రూరల్ : పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓగా సీఐ రఘుపతిరెడ్డి ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. బుధవారం స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ప్రతిభా సంస్థ నిర్వాహకులు, వినియోగదారుల సమాచార కేంద్రం జిల్లా అధ్యక్షుడు గిరగాని సుదర్శన్, స్వయంకృషి సంస్థ నిర్వాహకులు బెజ్జంకి ప్రభాకర్, ఏఎస్ఆర్ సంస్థల నిర్వాహకులు ఎర్రబోయిన రాజశేఖర్, స్వచ్ఛంద వలంటీర్ కాసుల వెంకటచారి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలి

నర్సంపేట రూరల్ : బక్రీద్ పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని నర్సంపేట టౌన్ సీఐ ఎల్.రఘుపతిరెడ్డి అన్నారు. నర్సంపేటలోని పోలీస్‌స్టేషన్‌లో ఆవరణలో శాంతి కమిటీ మీటింగ్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలందరూ మత సామరస్యతో పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హిందు, ముస్లీం, క్రైస్తవ మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రామానంద్

నర్సంపేట: పట్టణంలోని 19వ వార్డుకు చెందిన మండల యాదగిరి బుధవారం మృతి చెందాడు. ఈ సందర్భంగా టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. పరామర్శించిన వారిలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, జిల్లా ఓబీసీ చైర్మన్ ఓర్సు తిరుపతి, మాజీ వైస్ ఎంపీపీ చింతల సాంబరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్ర యాకుబ్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి మాదాసి రవికుమార్, మాజీ కౌన్సిలర్ విజయ్‌కుమార్, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు సాంబయ్య, పట్టణ కార్యదర్శి నాగేశ్వర్, పట్టణ ప్రచార కార్యదర్శి మనోహర్ ఉన్నారు.

వర్ధన్నపేటలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న వల్లందాస్ కుమార్

వర్ధన్నపేట : రాష్ట్ర ప్రభుత్వం వర్ధన్నపేట నియోజకవర్గానికి కేటాయించిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలను మండలకేంద్రంలోనే ఏర్పాటు చేయాలని తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, రివాల్యూషన్ సోషలిస్ట్ పార్టీ జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్, ఎమ్మార్పీఎస్ పొలిట్ బ్యూరో సభ్యులు ఈరెల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని యంగ్ ఇండియా స్కూల్‌ని మండల కేంద్రంలోనే నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సొంత జిల్లాలో సీట్లు కేటాయించాలి

నర్సంపేట రూరల్ : సాంఘీక సంక్షేమ గురుకులాల పాఠశాల, కళాశాలల విద్యార్థులకు తమ సొంత జిల్లాలోనే సీట్లను కేటాయించాలని ఏబీ ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి ట్వీట్ చేసినట్లు ఆయన తెలిపారు. విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

జేఈఈ ఫలితాల్లో సత్తా చాటిన సింధూజ



సింధూజతో పాటు గురుకులాల విద్యార్థులను అభినందిస్తున్న సెక్రటరీ అలుగు వర్షిణి

వర్ధన్నపేట : మండలంలోని నల్లబెల్లికి చెందిన గోలి సింధూజ ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ఐఐటీ ఆల్ ఇండియాలో 12,763 ర్యాంక్ సాధించి సత్తా చాటింది. మడికొండ బాలికల కళాశాలలో ఎంపీసీ చదివిన సింధూజ ఆల్ ఇండియా ర్యాంక్, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో రెండో ర్యాంక్ సాధించింది. బుధవారం సింధూజతో పాటు గురుకులాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను రాష్ట్ర గురుకుల విద్యాసంస్థల సెక్రటరీ, ఐఏఎస్ అధికారి అలుగు వర్షిణి హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో అభినందించారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ గద్దె



కొత్తూరులో కూలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ గద్దె

రాయపర్తి : ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ కింద ఉన్న గద్దె కూలిపోయి ప్రమాదకరంగా మారినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన వ్యవసాయ బావుల వద్ద ఉన్న ఎస్ఎస్ ట్రాన్స్‌ఫార్మర్ గాలి దుమారానికి కూలిపోయి కాలిపోయింది. పలుమార్లు విద్యుత్ అధికారులకు తెలిపినప్పటికి పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి ప్రమాదం జరగకముందే చర్యలు చేపట్టి మరమ్మతు చేయాలని రైతులు కోరుతున్నారు. కార్యక్రమంలో రైతులు దొమ్మాటి సుభాష్, పుట్ట మెట్టయ్య, గుంటి కుమారస్వామి, జలగం సురేష్, దుడ్డు సమ్మయ్య, రుద్రారపు కుమారస్వామి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బైక్‌లు ఢీ.. ఇద్దరికి తీవ్రగాయాలు

నర్సంపేట రూరల్ : రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన పట్టణంలోని సర్వాపురం గ్రామశివారులోని నర్సంపేట–కొత్తగూడ ప్రధాన రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని 15వ వార్డుకు చెందిన తొగరు రాజు తన వ్యవసాయ భూమికి వెళ్లి గోంగూరను తీసుకొని నర్సంపేట వైపు వస్తున్నాడు. ఈక్రమంలో నర్సంపేట నుంచి కొత్తగూడ వైపు వెళ్తున్న మరో ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం వారిని నర్సంపేట ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ మొగిలిచర్లకు చెందిన గనిపాక బాబు(56) జీడబ్ల్యూఎంసీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. మే 29న తన స్కూటీపై ప్రయాణిస్తూ రెడ్డిపాలెం వద్ద ప్రమాదవశాత్తు కింద పడగా తీవ్రగాయాలయ్యాయి. నొప్పి భరించలేక ఈ నెల 2న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించగా కుటుంబ సభ్యులు గమనించి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ మహేందర్ తెలిపారు.

అదుపు తప్పి కెనాల్‌లోకి దూసుకెళ్లిన ట్రాక్టర్



వర్ధన్నపేట : అదుపు తప్పి ఎస్సారెస్పీ కెనాల్‌లోకి ట్రాక్టర్ దూసుకెళ్లిన ఘటన మున్సిపాలిటీ పరిధిలోని తల్లాకుంట తండాలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. సునావత్ వాసుకు చెందిన ట్రాక్టర్‌లో వ్యవసాయ పొలానికి ఎరువును తరలిస్తుండగా కెనాల్ కాల్వపై ఉన్న విద్యుత్ వైర్లను తాకడంతో ట్రాక్టర్ నడుపుతున్న ఇద్దరు యువకులు ట్రాక్టర్‌పై నుంచి దూకడంతో ట్రాక్టర్ అదుపుతప్పి కెనాల్‌లోకి దూసుకెళ్లినట్లు తెలిపారు. ఈ ఘటనలో ఇద్దరు యువకులకు స్వల్ప గాయాలయ్యాయని, వారు సమయానికి దూకడంతో పెనుప్రమాదం తప్పిందని తెలిపారు.

అయ్యప్పస్వామికి దివ్య పడిపూజ



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నర్సంపేట : శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో ఉత్తరాషాడ నక్షత్రంలో అయ్యప్పస్వామి జన్మదిన వేడుకల సందర్భంగా దివ్యపడిపూజ ఆలయ అధ్యక్షుడు సైఫా సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దాతలు తక్కళ్లపల్లి ప్రభాకర్‌రావు–లక్ష్మి, అనిల్‌కుమార్–ఇందు దంపతులు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి అన్నదాన చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్‌గుప్తా, అధ్యక్షుడు సైఫా సురేష్, కోశాధికారి రవీందర్‌గుప్తా, కార్యదర్శి కమలాకర్‌రెడ్డి, శ్రీరాం ఈశ్వరయ్య, వీరలింగం, గోవర్ధన్, లక్ష్మీనారాయణ, చెంచారావు, శ్రీనివాస్, మాధవ్‌శంకర్, వేణు, రాజు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'భూ భారతి'తో భూసమస్యల పరిష్కారం

- అదనపు కలెక్టర్ సంధ్యారాణి



సంగెం : కాట్రపల్లిలో రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి



పర్వతగిరి : దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు



ఖానాపురం : కొత్తూరులో దరఖాస్తులను సమర్పిస్తున్న రైతులు



నెక్కొండ : రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ రవి



దుగ్గొండి: రైతులనుంచి దరఖాస్తులు తీసుకుంటున్న డిప్యూటీ తహసీల్దార్ ఉమారాణి

సంగెం: భూ భారతితో భూ సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయని అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. బుధవారం మండలంలోని కాట్రపల్లి, చింతలపల్లి గ్రామాల్లో జరిగిన భూభారతి సదస్సులకు హాజరైనారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరికి తమ భూమిపై హక్కు చట్టబద్ధంగా, స్పష్టంగా ఉండేలా భూభారతి కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రైతుల నుంచి వచ్చిన పిర్యాదులను పరిశీలించారు. కాట్రపల్లిలో 135, చింతలపల్లిలో 85 పిర్యాదులు వచ్చాయని ఇందులో కాట్రపల్లిలో మూడు సమస్యలను తక్షణమే పరిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, సూపరిండెంట్ అబిద్ అలీ, తహసీల్దార్ రాజ్‌కుమార్, నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐలు పాల్గొన్నారు.

నెక్కొండ : భూ సమస్యల పరిష్కారానికి అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని రెవెన్యూ అధికారులు అన్నారు. నెక్కొండ మండలంలోని గుండ్రపల్లిలో తహసీల్దార్ రాజ్‌కుమార్, పత్తిపాకలో డిప్యూటీ తహసీల్దార్ రవి జరిగిన సదస్సుల్లో పాల్గొని మాట్లాడారు. గుండ్రపల్లిలో 73, పత్తిపాకలో 75 దరఖాస్తులు వచ్చాయని వారు అన్నారు. గురువారం సూరిపల్లి, చిన్నకొర్పోలు గ్రామాల్లో సదస్సులు జరుగుతాయని పేర్కొన్నారు.

ఖానాపురం : గ్రామీణ ప్రాంతాల్లో మిగిలిపోయిన భూ సమస్యలను పరిష్కారం కోసమే భూభారతి ప్రభుత్వం తీసుకువస్తుందని డీఏఓ రమేష్, డీటీ రాజారేణుక అన్నారు. మండలంలోని రాగంపేట, కొత్తూరు గ్రామాల్లో రైతు సదస్సులను బుధవారం నిర్వహించారు. రెండు గ్రామాల పరిధిలో దరఖాస్తులను స్వీకరించారు. డీఏఓ శ్రీనివాస్, ఏఆర్ఐ స్వామి, జీపీ కార్యదర్శి స్రవంతి, పాల్గొన్నారు.

పర్వతగిరి : భూ భారతి చట్టం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని డిప్యూటీ తహసీల్దార్ హారతి అన్నారు. బుధవారం రావూరు, బూరుగుమడ్ల గ్రామాల్లో భూ భారతి సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ భారతి, సీనియర్ అసిస్టెంట్ సూర్యమిత్ర, పంచాయతీ కార్యదర్శి కిరణ్, జూనియర్ అసిస్టెంట్ రమేశ్, టీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు చింత శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో 78 దరఖాస్తులు

దుగ్గొండి: మండలంలోని చలపర్తి, మందపల్లి గ్రామాల్లో బుధవారం రెవెన్యూ గ్రామసభలు నిర్వహించారు. మందపల్లిలో 49, చలపర్తిలో 29 దరఖాస్తులు వచ్చాయి. డిప్యూటీ తహసీల్దార్‌లు ఉమారాణి, రాజేశ్వర్‌రావు మాట్లాడారు. ఆర్ఐలు రాంబాబు, మల్లయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భూ భారతికి 126 దరఖాస్తులు

గీసుకొండ: మండలంలోని బొడ్డుచింతలపెల్లి, రామచంద్రాపురం గ్రామాల్లో బుధవారం భూ భారతి గ్రామ సభలను నిర్వహించారు. బొడ్డచింతలపెల్లిలో 80, రామచంద్రాపురంలో 46 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ రియాజుద్దీన్ తెలిపారు. కార్యక్రమంలో డీటీ రవీందర్, ఆర్ఐలు సాంబయ్య,శ్రీధర్ , రైతులు పాల్గొన్నారు.

రాయపర్తి: మండలంలోని కొండూరు, బురహాన్‌పల్లి గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులను నిర్వహించినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. నేడు కేశవాపురం, కొలన్‌పల్లి గ్రామాల్లో భూభారతి సదస్సులను నిర్వహించనున్నట్లు చెప్పారు.



గీసుకొండ : బొడ్డుచింతలపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ రియాజుద్దీన్



రాయపర్తి: రెవెన్యూ సదస్సులో వినతులు స్వీకరించి మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్యశిబిరానికి హాజరైన మహిళలు

వర్ధన్నపేట : మండలంలోని దివిటిపల్లి గ్రామంలో మహిళలకు బాలవికాస ఆధ్వర్యంలో లక్ష్మీనరసింహ హాస్పిటల్ సహకారంతో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామంలోని మహిళలకు వైద్యశిబిరాన్ని సందర్శించి పరీక్షలు చేయించుకొని ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మహిళలకు వచ్చే ప్రత్యేక ఆరోగ్య సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ తేజస్విని, పీఆర్ఓ సుభాష్, పాషా, సిస్టర్స్, బాలవికాస బృందం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత



నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

వర్ధన్నపేట : ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని 670 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన బుధవారం మండలంలోని కడారిగూడెం, కట్ర్యాల గ్రామాల మధ్యలో చోటు చేసుకుంది. ఎస్సై చందర్ తెలిపిన వివరాల ప్రకారం..పక్కా సమాచారం మేరకు రెండు గ్రామాల మధ్య పోలీసులు తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న మంద థామస్ వద్ద గంజాయి స్వాధీనం చేసుకుని విచారించగా పాల్వంచకు వెళ్లి కోడి మనోజ్‌కుమార్ నుంచి 670 గ్రాముల గంజాయిని కొనుక్కొని వస్తున్నట్లు చెప్పాడు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.